సాక్షి అనంతపురం

బుధవారం । 23 । ఆగస్టు । 2023



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.30, కనిష్టం రూ.7, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్ఠం/కనిష్ఠం
37.3°/22.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి



కార్మికులతో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్


రాప్తాడురూరల్: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కింద జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం ఆలమూరు హౌసింగ్ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 'నవరత్నాలు –పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఆలమూరు లేఅవుట్‌లో అనంతపురం అర్బన్‌కు సంబంధించి ఆప్షన్–3 కింద 5,315 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో 872 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా, బేస్మెంట్ స్థాయిలో 2 వేలు, బిలో బేస్మెంట్ స్థాయిలో 1,300 వరకు ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వార్డు ఎమినిటీ సెక్రటరీలు, హౌసింగ్ అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలన్నారు. జేసీ వెంట డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, తహసీల్దార్ శ్రీధరమూర్తి, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

26న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ప్రధాన సమావేశ మందిరంలో ప్రారంభమయ్యే సమావేశానికి మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు కలెక్టర్లు ఎం.గౌతమి, అరుణ్‌కుమార్ సహా రెండు జిల్లాల అధికారులు, జెడ్పీటీసీ, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరు కానున్నారు.

హెచ్చెల్సీకి పైపింగ్



ఉంతకల్లు వద్ద బయటకు వస్తున్న నీరు

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు సమీపంలో తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) 113–557 కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్‌కు పైపింగ్ పడి నీరు బయటకు వస్తోంది. గత వారం పైపింగ్ పడిన చోట అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. హెచ్చెల్సీకి 1,500 క్యూసెక్కుల నుంచి 1,800 క్యూసెక్కులకు నీటి ప్రవాహాన్ని పెంచడంతో తిరిగి అదే ప్రాంతంలో పైపింగ్ పడింది.

నేడు ఉద్యోగుల 'స్పందన'

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక 'స్పందన' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మందు బిళ్ల.. ఒళ్లు గుల్ల

- మందులు శృతిమించి.. జబ్బులు మొండికేసి
- విచ్చలవిడి యాంటీబయోటిక్స్ వినియోగంతో భారీ నష్టం
- రోజురోజుకూ పెరుగుతున్న ప్రాణాధార మందుల వినియోగం
- ఉన్న జబ్బులు పోకపోగా కొత్త జబ్బులకు దారి తీస్తున్న పరిస్థితి

ఉమ్మడి జిల్లాలో రిటైల్ మందుల షాపులు	2,050
ఉమ్మడి జిల్లాలో హోల్ సేల్ మందుల షాపులు	50
ఏటా యాంటీ బయోటిక్స్ వినియోగం	రూ.240 కోట్లు
వినియోగిస్తున్న వారి సంఖ్య	25 లక్షల పైనే
డాక్టరు చిట్టీ లేకుండా వాడుతున్న వారి సంఖ్య	9 లక్షలు





సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రాణాలను కాపాడే యాంటీబయోటిక్స్ ఒక్కోసారి ప్రాణాంతకమవుతున్నాయి. విచ్చలవిడి వినియోగం కొంప ముంచుతోంది. ప్రతి చిన్న రోగానికీ పెద్ద మందు వేయడం శరీరానికి భారంగా మారింది. జలుబు, దగ్గు వంటి చిన్న చిన్న వాటికి కూడా ఖరీదైన, మోతాదుకు మించి యాంటీబయోటిక్స్‌ను వాడుతున్నారు. దీంతో కొన్ని రకాల బాక్టీరియా హై డోస్ (తీవ్ర మోతాదుతో కూడిన) యాంటీబయోటిక్స్‌కూ లొంగని పరిస్థితి ఎదురైంది. దీనివల్ల జరగాల్సిన నష్టం కంటే ఎక్కువగా జరుగుతున్నట్టు వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాంటీబయోటిక్స్ గురించి కొన్ని నిజాలు..

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా రూ.240 కోట్ల విలువైన యాంటీబయోటిక్స్ వినియోగంలో ఉన్నట్టు అంచనా.
- డాక్టరు సూచించినవి కాకుండా నేరుగా కౌంటర్ సేల్ అంటే మందుల షాపు వద్దకెళ్లి వాడుతున్న వారు 30 శాతం మంది.
- ఉదాహరణకు ఒక వ్యాధి తగ్గాలంటే ఐదురోజుల కోర్సు పూర్తి చేయాలి. కానీ మూడురోజులకే జబ్బు తగ్గిందని ఆపేస్తున్నారు.
- చిన్న చిన్న జ్వరాలు, జలుబు, దగ్గు, విరేచనాలు వంటి జబ్బులకు యాంటీబయోటిక్స్ వాడేవాళ్లు ఎక్కువయ్యారు.
- యాంటీబయోటిక్స్‌కు జబ్బులు తగ్గకపోతే రోగం ముదిరి ఎక్కువ రోజులు ఆస్పత్రిలో ఉండాలి. దీని వల్ల ఆర్థికంగా చితికిపోతారు.
- ఎక్కువ వినియోగంలో ఉన్న యాంటీబయోటిక్స్... అజిత్రోమైసిన్, సెఫాక్సిమ్, సెఫడోక్సిమ్, నార్ ఫ్లాక్సిన్, సెఫ్ట్రియాక్సోన్, ఆఫ్లాక్సోసిన్, సిప్రోఫ్లాక్సిన్, సిఫ్రాన్, సెప్ట్రాన్, మోనోసెఫ్, టాజోబ్యాక్టమ్ వంటివి.

నియంత్రణ ముఖ్యం

- యాంటీ బయోటిక్స్ వాడేముందు డాక్టర్ ప్రిస్కిప్షన్ తప్పనిసరి.
- యాంటీ బయోటిక్స్ వాడేటప్పుడు కోర్సు పూర్తయ్యే వరకూ మధ్యలో మానెయ్యొద్దు.
- డాక్టర్ సూచించిన మోతాదే వాడాలి.
- మెడికల్ స్టోర్‌కు వెళ్లి మనకు మనమే యాంటీ బయోటిక్ తెచ్చుకోకూడదు.
- చిన్న చిన్న జబ్బులకు యాంటీబయోటిక్స్ వాడటం మంచిది కాదు.

మోతాదుకు మించి వాడితే...



యాంటీబయోటిక్స్ పరిమితంగా వాడాలి. జబ్బును బట్టి డాక్టర్ ప్రిస్కిప్షన్ మేరకే కోర్సు వాడాలి. అలాగని రెండ్రోజులు వాడి వదిలేయకూడదు కూడా. పరిమిత మోతాదులో జబ్బును బట్టి వాడితేనే మంచిది. లేదంటే కొన్ని జబ్బులు మొండికేసే అవకాశం ఉంటుంది.

–డా.ఫణి మహేశ్వరరెడ్డి, జనరల్ సర్జన్

లొంగకపోతే పెద్ద ప్రమాదం



యాంటీబయోటిక్స్ మందులు పరిమితంగా ఉంటాయి. ఒక్కసారి ఈ మందులకు బ్యాక్టీరియా లొంగకపోతే తర్వాత కష్టం. కొత్త జబ్బులు వచ్చినప్పుడు ఈ మందులు పనిచేయవు. ఈ పరిస్థితులను అధిగమించడం చాలా కష్టమవుతుంది. పరిమిత మోతాదులో వాడాలి.

– డా.సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి, హృద్రోగ నిపుణులు

పక్కాగా ఇంటింటి సర్వే

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఉరవకొండ: ఓటరు జాబితా సవరణలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా జరిగిందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏఆర్‌ఓ హరిప్రసాద్, ఎన్నికల డీటీ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణతో జేసీ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ విలేకరులతో మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలో 2.15లక్షల ఓటర్లు ఉన్నారని, ఇందులో ప్రతి ఇంటికీ వెళ్లి బీఎల్‌ఓలు సర్వే చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా 10,023 మందికి మంజూరైన బియ్యం కార్డులను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఉరవకొండ మండలంలో భూముల రీ సర్వే చురుగ్గా సాగుతోందన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే గ్రీవెన్స్‌కు ఉరవకొండ తో పాటు ఇతర మండలాల నుంచి ఎక్కువ శాతం అర్జీలు వస్తున్నాయన్నారు. ఎందుకని ఆరా తీస్తే మండల కేంద్రాల్లో జరిగే గ్రీవెన్స్‌లో అధికారులు గైర్హాజరవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓగా జేసీ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈఓగా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.గౌతమి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు సీఈఓగా పని చేసిన కె.భాస్కర్‌రెడ్డి సస్పెండైన సంగతి తెలిసిందే. ఉరవకొండ నియోజకవర్గంలో ఓట్ల గల్లంతు వ్యవహారానికి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు భాస్కర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ రెండ్రోజుల కిందట పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జేసీ కలెక్టర్ కేతన్‌గార్గ్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

దొంగ ఓట్లు చేర్చిందే పరిటాల కుటుంబం

- మళ్లీ ఇప్పుడేమో 'దొంగ ఓట్లు' ఉన్నాయంటూ గగ్గోలు
- చనిపోయిన వారు ఓటు తొలగించాలని ఎలా దరఖాస్తు చేస్తారు?
- ఎవరి ప్రమేయమూ లేకుండా మీకు మీరే ఆన్‌లైన్ చేస్తున్నారు
- సునీత ఎన్నికల నటన మొదలైంది
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడు నియోజకవర్గంలో దొంగ ఓట్లు చేర్పించిందే పరిటాల కుటుంబమని, ఇప్పుడేమో వారే 'దొంగ.. దొంగ' అంటూ గగ్గోలు పెడుతున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం అనంతపురం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలో గతంలో 17వేల దొంగ ఓట్లు చేర్చారని, ఈ విషయంపై ఆనాడే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. రామగిరిలో కర్ణాటకకు చెందిన వారిని ఓటర్లుగా చేర్చారన్నారు. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం పరిటాల సునీత అనంతపురంలో ఓ కార్యాలయం ఏర్పాటు చేయించి 10 కంప్యూటర్లు పెట్టించి ఓటరు తమ ఓటును తొలగించాలని అభ్యర్థించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారన్నారు. అందులో 432 మంది చనిపోయిన వారు కూడా ఉన్నారన్నారు. మృతి చెందిన వారు ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకుంటారో పరిటాల కుటుంబమే చెప్పాలన్నారు. ఎన్నికల అధికారులు చనిపోయిన వారి ఓటర్లను బీఎల్‌ఓల ద్వారా తొలగింపజేయాలన్నారు. పరిటాల సునీత రాప్తాడులో గెలవలేమని ధర్మవరానికి వలస వెళ్లారన్నారు. మళ్లీ తిరిగి వచ్చి రాప్తాడులో నటన మొదలు పెట్టారన్నారు. సునీత మహానటనకు అధికారులు మోసపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. దొంగ ఓట్లు చేర్చినట్లు ఎక్కడైనా తెలిస్తే చర్యలు తీసుకోవాలని ఎన్నికల అధికారులను కోరామన్నారు. చనిపోయిన వారి ఓట్లను తొలగించాలంటూ వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. మీరు చేసిన మంచి ఏదైనా ఉంటే ప్రజలకు తెలియజేయాలి తప్ప దొంగ ఓట్లు ఉన్నాయంటూ డ్రామాలు ఆడొద్దని సునీతకు హితవు చెప్పారు. మీరు కానీ, చంద్రబాబు నాయుడు కానీ ఈ ప్రాంతంలో ఏమి చేశారో చెప్పుకుని ప్రజల్లో తిరగాలన్నారు. అర్హులైన వారి ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తే తాము ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

దొంగ ఓట్లకు కేరాఫ్ టీడీపీ



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: దొంగ ఓట్లకు టీడీపీ కేరాఫ్ అని, అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో దొంగ ఓట్లను చేర్పించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య విమర్శించారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పయ్యావుల కేశవ్ ఉరవకొండలో దొంగ ఓట్లతోనే ఎమ్మెల్యేగా గెలిచాడన్నారు. 2019లో ఓట్ల సవరణ సందర్భంగా విధి విధానాలు పాటించకపోవడంతోనే ఎన్నికల కమిషన్ అధికారులపై చర్యలు తీసుకుందన్నారు. నాటి ఓట్ల తొలగింపును ఎన్నికల కమిషన్ ఎక్కడా తప్పు పట్టలేదన్నారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారు ఓటు ఎక్కడ ఉంచుకుంటారనే దానిపై సమగ్ర విచారణ ద్వారా తేల్చాలని కోరారు.

నియోజకవర్గానికే చీడపురుగు జేసీ

- తనలాంటి పెస్టిసైడ్‌తోనే అది నాశనం
- వలంటీర్లపై కారు కూతలు తగదు
- ప్రజలు విజ్ఞతతో ఆలోచించాలి
- మహా సంక్షేమ పాదయాత్రలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: నియోజకవర్గానికి పట్టిన చీడపురుగు జేసీ ప్రభాకర్‌రెడ్డి అని, ఆ పురుగు నాశనానికి మందు (పెస్టిసైడ్) తానేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. యాడికి మండలం గుడిపాడు నుంచి మంగళవారం ప్రజా సంక్షేమ యాత్ర నాలుగో విడత కార్యక్రమానికి పెద్దారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి రాజకీయ స్వలాభం కోసం కక్షలు, కార్పణ్యాలకు ఆజ్యం పోస్తూనే ఉంటారన్నారు. ఇలాంటి నీచుడి వల్ల ప్రజలు ఎక్కడ నాశనమైపోతారోనన్న భయంతో తాను జేసీ లాంటి చీడ పురుగుతో పోరాడుతున్నానన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తాను ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటానన్నారు. జేసీ ప్రభాకర్ రెడ్డితోనే తనకు ఫ్యాక్షన్ కొనసాగుతుందన్నారు. యుద్ధం చేసినా, రాజకీయం చేసినా అది జేసీ కుటుంబంతోనే అని స్పష్టం చేశారు.

టీడీపీ కార్యకర్తలూ ఆలోచించుకోండి..!

జేసీ ప్రభాకర్‌రెడ్డి ఏనాడైనా అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ కార్యక్రమాలు నిర్వహించాడా, అందుకు మిమ్మల్ని ఆహ్వానించారా అన్నది నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి సూచించారు. జేసీ తన ఇంటికి కార్యకర్తలను రప్పించుకుంటారని, దొంగలారీలను రక్షించుకునేందుకు, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు మాత్రమే వినియోగించుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకుంటాడన్నారు. కుమారుడేమో పబ్‌లు, వీకెండ్‌లో ఎంజాయ్ చేయాలి... అనుచరులు, కార్యకర్తలు మాత్రం కేసుల్లో ఇరుక్కుని అరెస్ట్ అయ్యి, వారి కుటుంబాలు రోడ్డున పడాలి.. ఇదీ జేసీ ప్రభాకర్‌రెడ్డి నైజమని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్నందున త్వరలోనే మీ ముందుకు వచ్చి ఓట్లు అభ్యర్థిస్తాడని, ప్రజలు విజ్ఞతతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కుల, మత, ప్రాంత, వర్గం, రాజకీయ పార్టీ అనే తేడా లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు సత్వర సేవలందుతున్నాయన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ సేవలందిస్తున్న వలంటీర్లపై కారుకూతలు కూస్తున్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు లాంటి వారికి అధికారం కట్టబెడితే వ్యవస్థలన్నింటినీ పూర్తిగా నాశనం చేస్తారన్నారు. మండలంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశానని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తాను కృషి చేస్తున్నానన్నారు. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలకు సాగునీటి వనరులను సమకూర్చగలిగామన్నారు. త్వరలో తాడిపత్రి మండలంలో 6 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

తిరుపతి ప్యాసింజర్‌లో సాంకేతిక లోపం



కల్లూరు రైల్వే స్టేషన్లో ఆగిన రైలు

గార్లదిన్నె: తిరుపతి ప్యాసింజర్ రైలులో సాంకేతిక లోపం ఏర్పడి 45 నిమిషాలు ఆలస్యంగా నడిచింది. తిరుపతి నుంచి హిందూపురం వెళ్తున్న ప్యాసింజర్ రైలు మంగళవారం ఉదయం 7.30 గంటలకు గార్లదిన్నె మండలం కల్లూరు వద్దకు రాగానే ఇంజిన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. అరగంట అనంతరం రైలు ముందుకు కదిలింది. అలా గార్లదిన్నె స్టేషన్ వద్దకు రాగానే మరోసారి సాంకేతిక లోపంతో మొరాయించింది. ఇక్కడ మరో 15 నిమిషాలు ఆగిపోయింది. అధికారులు సాంకేతిక లోపం సరిచేయడంతో రైలు తిరిగి ముందుకెళ్లింది. రైలు ఆలస్యంగా నడవడంతో సమీప స్టేషన్‌లో దిగాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అత్యవసరమున్న ప్రయాణికులు రైలు దిగి ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు చేరుకున్నారు.

అభివృద్ధి పనుల్లో పురోగతి చూపాలి

- డిసెంబరు నాటికి నిర్మాణాలు పూర్తవ్వాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం





మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్‌జైన్, పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఎప్పటికప్పుడు పురోగతి చూపాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించా రు. భవన నిర్మాణాలు, నాడు–నేడు పనులు, 'గడప గడపకూ మన ప్రభుత్వం' పనులు తదితర అంశాలపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో అసిస్టెంట్ కలెక్టర్ కుషాల్‌జైన్, పంచాయతీరాజ్ ఎస్‌ఈ భాగ్యరాజ్‌తో కలిసి డీఈలు, జేఈలు, ఇతర అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా పనుల్లో పురోగతి సాధించకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం డివిజన్ వారీగా పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని చెప్పారు.

భవనాల నిర్మాణం పూర్తవ్వాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాల పూర్తికి ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ సూచించారు. సచివాలయ భవనాలు 432 మంజూరు చేస్తే ఇప్పటి వరకు 277 పూర్తయ్యాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు 361కు గాను 240, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు 270కి గాను 132 పూర్తి చేశారన్నారు. మిగిలిన భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టిన 'నాడు–నేడు' పనులు 70 శాతం పూర్తి చేశారన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులు గడువులోగా పూర్తవ్వాలన్నారు.

1,220 పనులు మంజూరు

'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం కింద 1,220 పనులు మంజూరు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇందులో 1,096 గ్రౌండింగ్ అయ్యాయన్నారు. ఇందులో 306 పనులు పూర్తికాగా, మరో 500 పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. గ్రౌండింగ్ అయిన అన్ని పనులూ పూర్తి చేయాలని ఆదేశించారు. గత వారం 128 పనులు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశిస్తే 32 పనులు పూర్తి చేశారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో పీఆర్ ఈఈ శంకరయ్య, డీఈలు, జేఈలు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి మౌలిక వసతులు కల్పించాలి

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించాలని కలెక్టర్ గౌతమి ఆదేశించారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. బుక్కరాయసముద్రం మండలం జంతలూరు వద్ద ఏర్పాటు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతపురం – తాడిపత్రి హైవే నుంచి సెంట్రల్ యూనివర్సిటీకి రెండు వరుసల రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. భవన నిర్మాణాలకు హెచ్చెల్సీ అడ్డు రాకుండా, పొలాలకు సజావుగా నీరు వెళ్లేలా యూనివర్సిటీ పక్క నుంచి కాలువ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేకంగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. విద్యార్థులకు తాగునీటి సౌకర్యార్థం ఎంపీఆర్ నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్ లేదా కెనాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనివర్సిటీలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలన్నారు. ప్రహరీ, భవన నిర్మాణం సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ హనుమాన్ కెనడీ, సీపీడబ్ల్యూడీ ఈఈ శ్రీనివాస్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, హెచ్‌ఎల్‌సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఏపీఎస్‌సీఆర్‌ఐసీ ఈఈ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ పుణ్యవతి పాల్గొన్నారు.

సువర్ణావకాశం ఓపెన్

- దూరవిద్యతో బంగారు భవిత
- చదువులు మధ్యలో మానేసిన వారికి మంచి అవకాశం
- రెగ్యులర్ సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు
- వివిధ రంగాల్లో ఉన్నత శ్రేణిలో రాణిస్తున్న ఓపెన్ స్కూల్ పూర్వ విద్యార్థులు
- ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లకు అవకాశం



రాప్తాడు రూరల్: చదువుకోవాలనే కోరిక ఉన్న వారికి సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఉజ్వల భవిష్యత్తును అందిస్తోంది. రెగ్యులర్ పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లతో సమానంగా ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లూ చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి. 2023–24 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నెల 31 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చు. జిల్లాలో 45 అధ్యయన కేంద్రాల ద్వారా ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తారు. పాఠశాల స్థాయిలో కీలకమైన పదో తరగతి, కళాశాల స్థాయిలో ఇంటర్ విద్యను అభ్యసించలేని వారు, లేదా మధ్యలోనే ఆపేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఆ కలను సాకారం చేసుకునే సువర్ణ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీ, హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లు పొందొచ్చు.

అనేక మంది ఉన్నత చదువులు

సార్వత్రిక విద్యా పీఠం జారీ చేసే సర్టిఫికెట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపును కలిగి ఉంటాయి. వీటితో ఉన్నత చదువులు, ఉద్యోగాలకూ అర్హత దక్కుతుంది. ఇప్పటికే ఈ విద్యాపీఠం ద్వారా ఆయా కోర్సులు పూర్తి చేసిన అనేకమంది దేశ రక్షణ దళంలో సేవలందిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులుగా స్థిరపడ్డారు. టీచర్లు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఇంజినీర్లు, నర్సులుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. ప్రైవేట్ కంపెనీల్లోనూ ఎంతో మంది ఉద్యోగాలు చేస్తూ ఉన్నత శ్రేణిలో స్థిరపడ్డారు.

ఇతర బోర్డుల్లో చదువుతున్న వారు అనర్హులు

ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుకుంటున్న విద్యార్థులు ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రవేశాలకు అనర్హులు. ఈ విషయాన్ని దాచి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొంది ఉత్తీర్ణత పొందితే వారి సర్టిఫికెట్లను ఎలాంటి నోటీసు లేకుండా రద్దు చేస్తారు. అలాగే చట్టపరమైన చర్యలూ తీసుకుంటారు. విదేశాల్లో పదో తరగతి చదివి ఓపెన్ స్కూల్‌లో ఇంటర్ చేయాలనుకుంటే బోర్డు ఆఫ్ ఇంటర్ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ప్రవేశం కోసం అన్ని ధ్రువీకరణపత్రాలతో ఓపెన్ స్కూల్ డైరెక్టర్ (గుంటూరు)ను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు స్వీకరిస్తారు.

సద్వినియోగం చేసుకోండి



వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఓపెన్ స్కూల్ మంచి అవకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువు పట్ల ఆసక్తి ఉన్న అనేకమంది ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులకు వెళ్లి ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో స్థిరపడ్డారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి. గడువులోపు అడ్మిషన్లు పొందాలి.

– గోవిందనాయక్, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్/ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్

క్లుప్తంగా

బీటెక్, బీ-ఫార్మసీ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో నిర్వహించిన బీటెక్ మొదటి సంవత్సరం 1, 2వ సెమిస్టర్ (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు, బీ–ఫార్మసీ ఒకటో సంవత్సరం రెండో సెమిస్టర్, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ (ఏ) వెబ్‌సైట్ (http://jntuaresults.ac.in)లో అందుబాటులో ఉంచారు.

ఎస్‌ఎన్‌సీయూ ఏర్పాటుకు స్థల పరిశీలన



సర్వజనాస్పత్రిలోని ఎస్‌ఎన్‌సీయూను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో మరో నవజాత శిశు కేంద్రం (ఎస్‌ఎన్‌సీయూ) ఏర్పాటుకు స్థల పరిశీలన పూర్తయినట్లు ఆ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సర్వజనాస్పత్రిలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎస్‌ఎన్‌సీయూను ఆయన పరిశీలించారు. ఇదే యూనిట్ పైభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో 20 పడకల ఎస్‌ఎన్‌సీయూకు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు, చిన్నపిల్లల వైద్యులకు ఆయన సూచించారు. అనంతరం ఈఎన్‌టీ వార్డు సమీపంలో ఉన్న ఆప్తమాలజీ ఓటీని పరిశీలించి, ఆపరేషన్ థియేటర్ ప్రారంభానికి ఆమోదం తెలిపారు. అనంతరం వివిధ వార్డులను పరిశీలించిన సూపరింటెండెంట్ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. సూపరింటెండెంట్ వెంట ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, సీనియర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ సునీత, గ్రేడ్ 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, తదితరులున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: స్థానిక సీపీఐ కొట్టాలలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. అందిన సమాచారంతో మంగళవారం ఉదయం తనిఖీలు చేపట్టి జూదరులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. వీరి నుంచి రూ.3,300, ఓ సెల్‌ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే నేలకోటతండాకి చెందిన ఓ మహిళ నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి మూడు లీటర్ల నాటు సారాని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉడాయింపునకు రిమాండ్ ఖైదీ విఫలయత్నం

- స్థానికుల సహకారంతో బంధించిన పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న రామాంజినేయులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: పోలీసుల చెర నుంచి తప్పించుకుని ఉడాయించేందుకు ఓ రిమాండ్ ఖైదీ విఫలయత్నం చేశాడు. పారిపోతున్న ఖైదీని పట్టుకునే క్రమంలో ఓ కానిస్టేబుల్‌కు చెయ్యి విరిగింది. వివరాలు.. అనంతపురంలోని నవోదయకాలనీకి చెందిన రామాంజినేయులు పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. మంగళవారం ఉదయం వైద్య పరీక్షల నిమిత్తం ఖైదీని సర్వజనాస్పత్రికి పోలీసులు తీసుకువచ్చారు. వైద్య పరీక్షల అనంతరం మందుల కోసం కౌంటర్ వద్దకు చేరుకోగానే ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల కళ్లుగప్పి ఉడాయించాడు. గమనించిన ఏఆర్ కానిస్టేబుల్ సోమనాథ్ వెంటనే ఖైదీని పట్టుకునే క్రమంలో మెట్లపై నుంచి కిందపడ్డాడు. ఘటనలో ఆయన చెయ్యి విరిగింది. పోలీసులు గట్టిగా కేకలు వేయడంతో పారిపోతున్న ఖైదీని అక్కడి వారు పట్టుకుని పోలీసు ఔట్‌పోస్టుకు చేర్చారు. గాయపడిన కానిస్టేబుల్‌కు ఆస్పత్రి వైద్యులు చికిత్సనందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా పోలీసుల చెర నుంచి తప్పించుకోవాలని చూసిన రామాంజినేయులుపై మరో కేసును పోలీసులు నమోదు చేసి, జిల్లా జైలుకు తరలించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- వ్యసనాలకు బానిసై బలవన్మరణం

అనంతపురం సిటీ: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని యువకుడి ఆచూకీ లభ్యమైంది. జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన మేరకు.. అనంతపురం సమీపంలోని రైల్వే పట్టాలపై సోమవారం ఉదయం ఓ యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. మృతుడుని అనంతపురం లోని తాడిపత్రికి వెళ్లే మార్గంలో ఉన్న కేవీఎస్ కాలనీకి చెందిన అనిల్(21)గా గుర్తించారు. లక్ష్మీదేవి, అక్కులప్ప దంపతులకు కుమారుడు అనిల్‌తో పాటు మరో ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ పెళ్లిళ్లు జరిగాయి. మనస్పర్థల కారణంగా పదేళ్లుగా లక్ష్మీదేవి, అక్కులప్ప వేర్వేరుగా ఉంటున్నారు. తల్లితో పాటు కలసి ఉంటున్న అనిల్ జులాయిగా మారి వ్యసనాలకు బానిసయ్యాడు. మత్తులో తానేమి చేస్తున్నాడో తనకే తెలియని స్థితిలో సోమవారం ఉదయం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని లక్ష్మీదేవికి అప్పగించారు.

అనంత వరదాయిని హంద్రీ–నీవా

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- రాగులపాడు ఎత్తిపోతల నుంచి నీటి పంపింగ్ ప్రారంభం



రాగులపాడు వద్ద కృష్ణాజలాలకు హారతి ఇస్తున్న విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

వజ్రకరూరు: జిల్లాకు వరదాయినిగా హంద్రీ–నీవా మారిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం రాత్రికి మండలంలోని రాగులపాడు ఎత్తిపోతల పథకం (లిఫ్ట్) వద్దకు కృష్ణాజలాలు చేరుకున్నాయి. మంగళవారం ఉదయం వై.విశ్వేశ్వరరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు అక్కడకు చేరుకుని గంగపూజ నిర్వహించారు. అనంతరం మోటార్లకు పూజలు నిర్వహించి జీడిపల్లి రిజర్వాయర్‌కు నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో విశ్వ మాట్లాడుతూ.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతనే హంద్రీ–నీవా పథకానికి మహర్దశ చేకూరిందన్నారు. రూ.వేల కోట్లు నిధులు మంజూరు చేస్తూ యుద్ధ ప్రాతిపదికన మొదటి దశ పనులు పూర్తి చేయించారని గుర్తు చేశారు. రెండో దశ పనులు కూడ 60 శాతం మేర పూర్తి చేసిన ఘనత డాక్టర్ వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాకు కృష్ణా జలాలు వస్తున్నాయంటే అది దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ చలువేనన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన ఈ నాలుగేళ్లలో హంద్రీ–నీవా కాలువ ద్వారా 150 టీఎంసీల కృష్ణా జలాలను జిల్లాకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేశారన్నారు. దీంతో జిల్లాలో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయని, ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగి అనంత జిల్లా సస్యశ్యామలమైందన్నారు. ప్రస్తుతం కాలువ వెడల్పుతో పాటు గాలేరు–నగరిను హంద్రీ–నీవాకు అనుసంధానం చేసి, జిల్లాకు మరింత మేలు చేయడానికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ రామకృష్ణాయాదవ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరెడ్డి, రైతు విభాగం కార్యదర్శి వెంకటరెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ఎంపీపీ సుంకమ్మ, స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామాంజినేయులు, ఉరవకొండ ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'అనంత'లో కర్నూలు వాసి కిడ్నాప్ కలకలం



నాగేంద్రబాబు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: 'అనంత'లో కర్నూలు వాసి కిడ్నాప్ కలకలం రేపింది. హైఅలర్ట్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా పోలీసు సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అలర్ట్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఓ హోటల్ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో వన్‌టౌన్ పోలీసులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఆరా తీశారు. అయితే కర్నూలుకు చెందిన వ్యక్తిని తెలంగాణలోని కరీంనగర్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకుని, తమ ప్రాంతానికి పిలుచుకెళ్లినట్లు గుర్తించారు. వివరాలు.. కర్నూలులోని బళ్లారి బైపాస్ చౌరస్తా సమీపంలో నివాసముంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి నాగేంద్రబాబు... హైదరాబాదులో లేని స్థలాన్ని ఉన్నట్లుగా రికార్డులు చూపి రూ.1.40 కోట్లకు దండుకుని కరీంనగర్ వాసులకు విక్రయించాడు. ఈ మోసంపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో నాగేంద్రబాబుని అరెస్ట్ చేసేందుకు తెలంగాణ పోలీసులు సిద్ధమై బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న నాగేంద్రబాబు అనంతపురంలో తలదాచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు ఇన్నోవా కార్లలో మఫ్టీలో వచ్చిన పోలీసులు... ఓ హోటల్‌లో నాగేంద్రబాబును గుర్తించి, అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. అయితే ఈ మొత్తం తతంగంపై స్థానిక పోలీసులకు సమాచారం లేకపోవడంతో కిడ్నాప్‌గా భావించాల్సి వచ్చిందని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు.

కట్టడంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు రంగనాయకులు

ధర్మవరం అర్బన్: నిర్మాణంలో ఉన్న కట్టడంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన రంగనాయకులు(55)కు భార్య రాములమ్మ, నలుగురు కుమార్తెలు ఉన్నారు. బతుకు తెరువు కోసం ధర్మవరానికి వలస వచ్చి చిన్నూరు రోడ్డు సమీపంలో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో అక్కడికి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రెండస్తుల భవన నిర్మాణ పనుల్లో మంగళవారం ఉదయం పాల్గొన్నాడు. రెండో అంతస్తుపై పైపుతో నీటిని పడుతుండగా అదుపు తప్పి జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ప్రాణాలు కాపాడిన ఎయిర్ బెలూన్స్



ప్రమాదంలో నుజ్జయిన కారు

వెల్దుర్తి: కారు అదుపుతప్పి ఆగి ఉన్న జీపును ఢీకొన్న ప్రమాదంలో ఎయిర్ బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. మంగళవారం రాత్రి జరిగిన ఘటన వివరాలు.. అనంతపురం నుంచి కర్నూలుకు డ్రైవర్ లక్ష్మీప్రశాంత్ పాటు మరో ముగ్గురు యువకులు కారులో బయలుదేరారు. వెల్దుర్తి వద్దకు చేరుకోగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన ఆపి ఉన్న బొలెరో క్యాంపర్ జీపును వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఆ సమయంలో కారు డ్రైవర్, పక్క సీటులోని యువకుడు సీట్‌బెల్ట్ ధరించడంతో కారులోని సేఫ్టీ ఎయిర్ బెలూన్స్ తెరుచుకుని స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

వైభవం.. వీరభద్రుడి రథోత్సవం





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం , వీరభద్రస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

విడపనకల్లు: మండలంలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉండబండ వీరభద్రస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. అంతకు ముందు ఆలయంలో తెల్లవారుజామునే విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అనంతరం భద్రకాళికాదేవి సమేత వీరభద్ర స్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా ఆలయ అన్నదాన కమిటీ చైర్మన్ దండిన శివానంద, సులోచన దంపతులు వ్యవహరించారు. మహాన్యాస రుద్రాభిషేకం, మహాబలి, పూర్ణాహుతి అనంతరం సుందరంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేశారు. ఉత్సవానికి హాజరైన వేలాది భక్తులు గోవింద నామస్మరణతో రథాన్ని ముందుకు లాగారు. కార్యక్రమాలను ఈఓ రమేష్‌బాబు, ఆలయ చైర్మన్ బసవరాజు తదితరులు పర్యవేక్షించారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

విద్యార్థిని బయటకు గెంటేసిన ప్రిన్సిపాల్

- ఆలస్యంగా వెలుగు చూసిన సంఘటన



విద్యార్థిని సుస్మితతో తల్లిదండ్రులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుకుంటున్న విద్యార్థినిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ బయటకు గెంటేశాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా... పామిడి మండలం పాల్యం తండా గ్రామానికి చెందిన ఆంజనేయులు నాయక్, తులసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమార్తె సరళాబాయి, రెండో కుమార్తె సుస్మిత ఉరవకొండలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 10, 9వ తరగతి చదువుతున్నారు. చదువుల్లో ఎంతో చురుగ్గా ఉండే సుస్మిత నెల రోజులుగా జ్వరం, తీవ్ర తలనొప్పితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ.. తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారం రోజుల క్రితం సుస్మితను పెట్టె, బేడాతో సహా బయటకు గెంటేసింది. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఆ విద్యార్థి నుంచి సమాచారం అందుకున్న తల్లిదండ్రులు ఆగమేఘాలపై పాఠశాలకు చేరుకుని ఏడుస్తున్న బిడ్డను అక్కున చేర్చుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్‌తో మాట్లాడి బాలికను స్వగ్రామానికి పిలుచుకెళ్లారు. చికిత్స అనంతరం ఆరోగ్యం కుదుట పడడంతో ఈ నెల 19న సుస్మితను పాఠశాలలో దిగబెట్టేందుకు వచ్చారు. ఆ సమయంలో ప్రిన్సిపాల్ మరోసారి తన దురుసుతనాన్ని బయటపెట్టింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ సుస్మితను పాఠశాలలోకి అనుమతించేది లేదని, టీసీ తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాలంటూ విద్యార్థి తల్లిదండ్రులపై చిందులేసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో బాలికను పిలుచుకుని తల్లిదండ్రులు స్వగ్రామానికి చేరుకున్నారు. ప్రిన్సిపాల్ దురుసు ప్రవర్తనతో తామెంతో మానసిక క్షోభను అనుభవిస్తున్నామని, తమ కుమార్తెను పాఠశాలలో చేర్చుకునేలా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

దారి దోపిడీకి యత్నం



బాధితుడు డ్రైవర్ వడ్డె శ్రీకాంత్





దుండగులు మహేష్, చాకలి నరేష్

వెల్దుర్తి: దారి దోపిడీకి యత్నించిన ఇద్దరు దుండగులను వెల్దుర్తి పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరానికి చెందిన డ్రైవర్ వడ్డె శ్రీకాంత్ బొలెరో క్యాంపర్ వాహనంలో డ్రిప్ పరికరాల లోడ్ జీ ెలంగాణలోని గద్వాలలో అన్‌లోడ్ చేసి తిరుగు ప్రయాణమయ్యాడు. మంగళవారం కర్నూలు సమీపంలోని పుల్లూరు టోల్‌గేట్ వద్దకు చేరుకోగానే వాహనాన్ని ఆపి కాలకృత్యాలు తీర్చుకున్నాడు. ఆ సమయంలో జీపులో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడన్న విషయం తెలుసుకున్న కర్నూలుకు చెందిన కురుబ మహేష్, చాకలి నరేష్ తమ బైక్‌పై జీపును వెంబడించారు. టోల్‌గేట్ దాటిన తర్వాత ఆపే ప్రయత్నం చేశారు. దోపిడీ చేసేందుకు వారు వెంబడిస్తున్నారని పసిగట్టిన డ్రైవర్ వాహనం ఆపలేదు. దీంతో దుండగులు తమ బైక్ బ్యాగ్‌లో ముందుగానే సిద్ధంగా ఉంచుకున్న రాళ్లు, బీరు సీసాలతో జీపు అద్దాలపై దాడి చేశారు. భయాందోళనకు గురైన డ్రైవర్ విషయాన్ని రాప్తాడు మండలానికి చెందిన తన ఓనరు రవిశంకర్‌నాయుడుకు ఫోన్‌లో తెలిపాడు. వెంటనే ఆయన వెల్దుర్తిలో తనకు తెలిసిన డిపో శ్రీను ద్వారా అక్కడి పోలీసులను అప్రమత్తం చేశాడు. దీంతో వెంటనే ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, ఎస్‌బీ కానిస్టేబుల్ ఖాజా, హైవే పోలీసులు భాస్కర్, మాధవరెడ్డి.. వెల్దుర్తి సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్దకు జీపు రాగానే ఆపారు. పోలీసులను గమనించి దుండగులు డోన్‌వైపు ద్విచక్ర వాహనంతో సహా ఉడాయిస్తుండగా పోలీసులు వెంబడించగా పెట్రోల్ బంక్ ఎదురుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన దొంగలు గతంలో కూడా ఇలాంటి నేరాలకు పాల్పడినట్లు సమాచారం. కాగా తనను, యజమాని డబ్బు రూ.2.80 లక్షలను కాపాడిన వెల్దురి పోలీసులకు బాధితుడు డ్రైవర్ వడ్డె శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

దాదాపీర్ కుటుంబానికి ప్రభుత్వం అండ



రూ.3 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: సౌదీలో ఆత్మహత్య చేసుకున్న దాదాపీర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.3 లక్షలు మంజూరు చేశారు. ఆ చెక్కును మృతుడి తండ్రి జిలాన్‌కు ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం అందించారు. నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన జిలాన్‌బాషా తనయుడు దాదాపీర్ ఉద్యోగ నిమిత్తం సౌదీకి వెళ్లాడు. గత నెలలో సౌదీలో ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దుర్గాదేవి, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, రామచంద్ర పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

రాప్తాడు: ఖరీఫ్‌లో సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ - క్రాప్ బుకింగ్ చేసుకుంటునే పరిహారం వర్తిస్తుందని ఏడీఏ రవి తెలిపారు. మంగళవారం ఆయన రాప్తాడు, అయ్యవారిపల్లి, బుక్కచెర్ల గ్రామాల్లో జరుగుతున్న ఈ - క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకొని ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ, సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేపించుకొనే రైతులు ఆర్‌బీకేల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, వీఆర్వో లక్ష్మన్న, వీహెచ్ఏ సోనియా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్ట్స్‌కాలేజీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాప్తాడురూరల్: ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టర్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు ప్రతిభ చాటారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు సందీప్, నవీన్‌కుమార్, భరత్, సాయినాథ్, ప్రేమ్ కుమార్ రెడ్డిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల్లోని వివిధ గ్రూపుల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ జి.రంగనాథ్ మాట్లాడుతూ బాలుర ఎన్‌సీసీ విభాగం నుంచి ఐదేళ్లుగా క్రమం తప్పకుండా రిపబ్లిక్ డే పరేడ్‌కు హాజరవుతున్నారన్నారు.

ఉచితంగా ఆధార్ అప్‌డేట్

అనంతపురం క్రైం గత పదేళ్లుగా ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారికి అప్‌డేట్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్ అప్‌డేట్‌కు అవసరమయ్యే అన్ని డాక్యుమెంట్స్ ఉచితంగా అందించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ నెల 25 వరకు నగరంలోని 1వ సచివాయలం నిర్మలానందనగర్, 14వ సచివాలయం పాతూరు, 17వ సచివాలయం గాంధీబజార్, 28వ సచివాలయం గిల్డాఫ్ స్కూల్, 30వ సచివాలయం సాయినగర్, 44వ సచివాలయం హమాలీ కాలనీ, 59వ సచివాలయం యువజన నగర్, 63వ సచివాలయం ఎరుకులవారి వీధిలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

పశువులు ఆగమాగం

నగరంలోని పలుచోట్ల ప్రధాన రహదారులపైనా, వీధుల్లోనూ పశువులు ఆగమాగమం చేస్తున్నాయి. రహదారుల మధ్యలో గుంపులుగా నిలిచి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధాన రహదారులపై వేగంగా వచ్చే వాహనాలకు పశువులు అడ్డుగా వస్తుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు సుందరీకరణలో భాగంగా పచ్చదనం పెంపొందించడానికి నగరంలోని ప్రధాన రహదారుల మధ్యలో నాటిన మొక్కలు, చెట్లను ధ్వంసం చేస్తున్నాయి. కొమ్మలు విరిచేస్తూ, ఆకులు తింటుండడంతో చెట్లు నాశనమవుతున్నాయి. నడిమివంక వద్ద ఓవర్ బ్రిడ్జి మధ్యలో నాటిన మొక్కలు, చెట్లను ఆవులు ధ్వంసం చేశాయి. సంబంధిత అధికారులు స్పందించి మొక్కల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. మూగజీవాలతో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



నడిమివంక వద్ద ఉన్న ఓవర్‌బ్రిడ్జి వద్ద వాహనదారులకు అడ్డంగా వస్తున్న పశువులు





ఓవర్ బ్రిడ్జి ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డంగా వస్తున్న పశువులు



చెట్ల కొమ్మలు, ఆకులను ఆవులు తినేయడంతో బోసిపోయిన దృశ్యం



చెట్ల ఆకులు తినేస్తున్న ఆవు

అనంత రచయితకు అరుదైన గౌరవం



లక్ష్మీనారాయణ

అనంతపురం కల్చరల్: అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా తొలిసారి తెలుగు రచయితకు అరుదైన అవకాశం రావడంపై అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు మంగళవారం వివరాలు అందించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో ఈనెల 20 నుంచి జరుగుతున్న అఖిల భారతీయ అభ్యుదయ రచయితల సంఘం 18వ మహాసభల్లో జాతీయ అధ్యక్షుడిగా పెనుకొండ లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.తెలుగు సాహితీవేత్తకు ఇంతటి గౌరవం దక్కడం అరుదైన విషయమని రాచపాలెంతో పాటు అరసం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడడడంతో ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. నగరంలోని ఓ పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడడంతో చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు.

పల్లె ముంగిటకే పాలన

- వైఎస్సార్‌సీపీతో గ్రామాల అభివృద్ధి బాట
- ఎక్కడికక్కడ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం
- నేడు పలుచోట్ల నూతన భవనాల ప్రారంభోత్సవం
- పాల్గొననున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత గ్రామాలకు గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం వచ్చేసింది. పట్టణాలకు వెళ్లకుండానే ప్రజలకు పల్లెల్లోనూ ప్రభుత్వ సేవలు అందనున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. వీటిని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు.

పట్టణాలకు వెళ్లకుండానే ప్రజలకు సేవలు

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయ వ్యవస్థ తెచ్చింది. అవినీతికి తావులేకుండా, రాజకీయ పార్టీలనే భేదం చూపకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. దాదాపు 35 ప్రభుత్వ శాఖల నుంచి 500 పైగా సేవలను కేవలం 15 నిమిషాల నుంచి 72 గంటల్లో పరిష్కరిస్తున్నారు. రూ.40 లక్షలతో గ్రామ సర్పంచు, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వేల్ఫేర్, మహిళా పోలీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ప్రజలు వీక్షించేందుకు ప్రత్యేక భవనం, ఇలా వివిధ శాఖలకు సంబంధించి ప్రత్యేకంగా గదులను సుందరగా నిర్మించారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యం..

గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించాలని రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 12 రకాల వైద్య సేవలు 14 రకాల వైద్య పరీక్షలు అందబోతున్నాయి. 65 రకాల మందులు, టెలి మెడిసన్ సేవలు, 67 రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌ను, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు అక్కడే ఉంటారు. పల్లెల్లోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు కావడంతో 24 గంటలూ వైద్యసేవలు అందనున్నాయి. అన్ని రకాల టీకాలు, గర్భిణులకు వైద్యంతో పాటు సుమారు 90 రకాల మందులు అందుబాటులో ఉంచనున్నారు. వైద్య పరీక్షల రిపోర్టులు వెంటనే అందించేందుకు ఆధునాతన యంత్ర సామగ్రిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 104 వాహనాల ద్వారా పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో ప్రజల చెంతకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం బీపీ, షుగర్, రెగ్యులర్ చెకప్‌లను పైసా ఖర్చు లేకుండా వైద్యం పొందొచ్చు.



మరూరులో ప్రారంభానికి సిద్ధమైన రైతు భరోసా కేంద్రం

రైతుల చెంతకే సేవలు..

ప్రభుత్వం, రైతులకు మధ్య దళారీ వ్యవస్థ బెడద లేకుండా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. ఆర్‌బీకే సిబ్బంది పంటల సాగులో సలహాలతో పాటు ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. డిజిటల్ కియోస్క్ సేవలు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, ఆధునిక సమాచారం, మార్కెటింగ్, ధరలు తదితర సేవలు ఆర్‌బీకేల ద్వారానే అందుతున్నాయి.

నేడు ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా నూతన భవనాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాప్తాడు మండలంలో ఉదయం 10 గంటలకు ప్రసన్నాయపల్లి (చిన్మయనగర్)లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, ఉదయం 11 గంటలకు మండల కేంద్రం రాప్తాడులో జగనన్న లేఅవుట్‌లో గ్రామ సచివాలయ భవనం-1, ఉదయం 11: 30 గంటలకు రాప్తాడు 44వ జాతీయ రహదారి సమీపంలో నిర్మించిన సచివాలయ భవనం-2ను ప్రారంభించనున్నారు.ఎం.చెర్లోపల్లిలో మధ్యాహ్నం 12 గంటకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, మరూరులో మధ్యాహ్నం 1 గంటలకు రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



సమావేశంలో సూచనలు, సలహాలిస్తున్న జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నేరాల నియంత్రణకు స్పెషల్‌పార్టీ సిబ్బంది ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేరాల నియంత్రణకు నియమించిన స్పెషల్‌పార్టీ సిబ్బంది క్రమశిక్షణతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి, శాఖకు గుర్తింపు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఆయన స్పెషల్ పార్టీ పోలీసులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా వారికి ఎస్పీ పలు సూచనలు, సలహాలు చేశారు. సబ్ డివిజన్ స్థాయిలో స్పెషల్ పార్టీ టీంలలోని సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలన్నారు. ఆయా సబ్ డివిజన్‌లలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. వీఐపీ బందోబస్తు, ఉత్సవాలు, ఊరేగింపులు, రోప్ పార్టీలు, ఆందోళనల నియంత్రణ, ట్రాఫిక్ సమస్య తలెత్తిన సమయాల్లో డీఎస్పీల నేతృత్వంలో ఎలా పని చేయాలో అవగాహన కల్పించారు. స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రజలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఇష్టంగా విధులు, బాధ్యతలు నిర్వర్తిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. మంచి అలవాట్లతో ఆరోగ్యంపైనా శ్రద్ధచూపాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఎస్ఐలు రాజశేఖరరెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

డీ అడిక్షన్ సెంటర్ పరిశీలన

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీ అడిక్షన్ సెంటర్‌ను ఎస్పీ కె. శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను బుగ్గి చేసుకోవద్దని సూచించారు. డీఅడిక్షన్ సెంటర్‌కు వచ్చి ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్‌స్టాప్ సెంటర్ అని జిల్లా ఎస్పీ అన్నారు. వన్‌స్టాప్ సెంటర్‌లో అనేక సేవలందుతున్నాయన్నారు. అనంతరం స్థానికంగా ఉంటున్న ఉజ్వల హోం, జువైనల్ హోం, సీడబ్ల్యూసీ కార్యాలయాలను ఎస్పీ సందర్శించారు. అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతపురం రూరల్ సీఐ విజయభాస్కరగౌడ్, ఎస్పీ సీఐలు ఉన్నారు.

విద్యా ప్రణాళికల్లోనూ క్రీడలకు ప్రాధాన్యత

- జేఎన్‌టీయూ(ఏ) స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్ జింకా రంగ జనార్దన



మాట్లాడుతున్న వీసీ జింకా రంగజనార్ధన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం విద్యా ప్రణాళిక (కర్రికులమ్)లో క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇస్తామని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ/ వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ పాలక భవనంలోని కాన్ఫరెన్స్ హాలులో 14వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించాల్సిన క్రీడలపై వివరించారు. ఆలిండియా, సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ పోటీల్లో అత్యధికంగా పతకాలు సాధించే విద్యార్థులు, కోచ్‌లకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బీటెక్ మొదటి సంవత్సరంలో స్పోర్ట్స్ పీరియడ్‌ను కచ్చితంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ బి. జోజిరెడ్డి, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, కలికిరి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ .విశాలి, పీఆర్వో డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రూ.1.6 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరంలోని వేణుగోపాల్‌నగర్ ఆటో స్టాండ్ వద్ద సీఎం ప్రత్యేక నిధులు రూ.1.6 కోట్లతో సీసీ, బీటీ రోడ్డు పనులకు మేయర్ వసీం మంగళవారం భూమి పూజ చేశారు. మేయర్ వసీం మాట్లాడుతూ 3,6,7 డివిజన్ల పరిధిలో మూడు సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు, 8 బాక్స్ కల్వర్టుల నిర్మాణ పనులను కూడా చేపడుతున్నామన్నారు. నగరంలో గత 30 ఏళ్లలో జరగని అభివృద్ధి అన్ని డివిజన్లలో జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18.92 కోట్లు, గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా వివిధ సచివాలయాల పరిధిలో మొత్తం రూ.14.98కోట్లు,సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మాజీ మేయర్ రాగే పరుశురాం, కార్పొరేటర్లు నాగమణి, సుజాత, దేవి, సైఫుల్లాబేగ్, అనిల్‌కుమార్ రెడ్డి, నాయకులు కృష్ణమూర్తి, గంగాధర్, యోగి, చంద్రమోహన్ రెడ్డి, ఖాజా, ఎస్ఈ నాగమోహన్, ఈఈ సూర్యనారాయణ, డీఈ శేఖర్, ఏఈ శంకర్ పాల్గొన్నారు.

బొమ్మేపర్తిలో సచ్చిదానంద



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

అనంతపురం కల్చరల్/రాప్తాడు:దత్తాత్రేయ స్వరూపులుగా పూజలు అందుకుంటున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ రాప్తాడు మండలం బొమ్మేపర్తి (జయలక్ష్మీ పురం) గణపతి సచ్చిదానంద ఆశ్రమానికి మంగళవారం చేరుకున్నారు. మైసూ రు దత్త పీఠం నుంచి ఆశ్రమానికి వచ్చిన స్వామీజీకి.. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గండ్లూరీ ట్రస్టు, సచ్చిదానంద ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను స్వామీజీ పర్యవేక్షించనున్నారు. జయలక్ష్మీ మాతాజీ, అన్నపూర్ణేశ్వరి విగ్రహ ప్రతిష్టల కోసం ట్రస్టు సభ్యులకు పలు సూచనలు చేశారు. మహిళలు ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. స్వామీజీ చేతుల మీదుగా భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

29న ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయ ప్రాగంణంలో ఈనెల 29న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బెంగళూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈఓ అక్కిరెడ్డి, కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆలయంలో కంటి వైద్య శిబిరం పోస్టర్లను విడుదల చేశారు.

విశ్రాంత ప్రొఫెసర్ పూజలు : ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ దశరథరామయ్య దంపతులు సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకొని, ఆలయానికి రూ.25వేల చెక్కును ఈఓ అక్కిరెడ్డికి అందించారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ సీఐగా జి.రామకృష్ణారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న విజయభాస్కర్‌గౌడ్‌ను వీఆర్‌కు పంపారు. రామకృష్ణారెడ్డి జిల్లాలో ఎస్ఐగా సుదీర్ఘ కాలం పని చేశారు. పుట్లూరు, గుంతకల్లు రూరల్, తాడిమర్రి, బత్తలపల్లి, నార్పల స్టేషన్లలో ఎస్ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది కర్నూలు జిల్లా ప్యాపిలికి వెళ్లారు. పత్తికొండ రూరల్ సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

అమరుల త్యాగనిరతిని అలవర్చుకోవాలి



మాజీ సైనికాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం: దేశ ఔన్నత్యం, దేశ రక్షణ కోసం అమరులైన వీరుల త్యాగ నిరతిని విద్యార్థులు అలవర్చుకోవాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. నా భూమి- నా దేశం (మేరీ మాటి, మేరి దేశ్) అనే కార్యక్రమంలో భాగంగా జేఎన్‌టీయూ అనంతపురం- ఓటీపీఆర్ఐ క్యాంపస్‌లో మంగళవారం పంచప్రాన్ ప్రతిజ్ఞ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ప్రాణత్యాగం చేసిన అమరవీరుల జ్ఞాపకార్థంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పదవీ విరమణ చేసిన సైనికాధికారులైన ఎస్. వెంకటేశ్, ఎం. ఖాసీం సాహెబ్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. గోపీనాథ్, పీఆర్వో డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు కేశ శైలజ, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు శ్రీనివాస కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు సత్సంగ సభ్యులతో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు బీఎస్ఎన్ఎల్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు.

ఎస్ఎస్‌హెచ్ ఆర్ఎంఓ నియామకం వివాదాస్పదం

అనంతపురం క్రైం: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆర్ఎంఓగా కార్డియాలజిస్టు డాక్టర్ సుభాష్ చంద్రబోస్‌ను నియమిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి మంగళవారం ఇచ్చిన ఉత్తర్వులు వివాదాస్పదానికి దారితీసింది. వాస్తవంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలు పూర్తిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ పరిధిలోకి వస్తాయని డీఎంఈ డాక్టర్ కే వెంకటేశ్ 2020 ఆగస్టు 3న ఉత్తర్వులు జారీ చేశారు. కానీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు ఆస్పత్రి ఉన్నతాధికారులు అంటున్నారు. దీనిపై వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవిని అడగడానికి ఫోన్‌లో సంప్రదించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఇప్పటికే సూపర్ స్పెషాలిటీ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా డాక్టర్ సౌజన్య కుమార్ ఉన్నారు. జిల్లా ఆస్పత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రిన్సిపాల్ జోక్యం చేసుకోవడం సర్వత్రా విమర్శలకు దారితీసింది.

ప్రతి కూలీకి పని కల్పించండి

ఆత్మకూరు: ప్రస్తుతం వర్షాలు లేనందున చాలా మంది వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉన్నారు. అలా కాకుండా జాబ్ కార్డు ఉండి పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీ పనులు కల్పించాలని ఏపీడీ అనురాధ ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక ఉపాధి హామి కార్యాలయంలో ఉపాధి హామి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణ బిల్లులు, ఉద్యాన, ఉపాధిహామీ పనుల బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు సుజాత, పుష్పా పాల్గొన్నారు.

25 నుంచి సత్యసాయి కార్మికుల సమ్మె

ఆత్మకూరు: ఈ నెల 25 నుంచి సమ్మె చేస్తున్నట్లు సత్యసాయి నీటి సరఫరా కార్మికులు తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ ప్రసాద్‌కు, పంచాయతీ కార్యాలయంలో సెక్రటరీ శైలజారాణికి వినతిపత్రం అందించారు. కార్మికులు శ్రీరాములు, చిన్నా, రమేష్‌రెడ్డి, దివాకర్, శ్రీధర్, హరి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూరు:ఉద్యోగ భద్రత కల్పించాలని వీఓ ఏలు డిమాండ్ చేశారు. మంగళవారం వీఓఏలు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఉషా రాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివ శంకర్, ఏపీఎం మదన్ మోహన్‌కు విన్నవించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

రాప్తాడు:అనంత జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. మంగళవారం రాప్తాడులో శీల్ల తిమ్మప్ప అనే రైతు సాగు చేసిన వేరుశనగ పంటను పరిశీలించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరుసర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. మంగళవారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా స్వామికి పంచామృతాభిషేకం , విశేష పూజలు చేశారు.షష్టి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీవల్లి , దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. కల్యాణోత్సవానికి భక్తులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. మంజునాథ స్వామి, పార్వతిదేవికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

హుండీ కానుకల లెక్కింపు..

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హుండీ కానుకల లెక్కింపు బుధవారం ఉంటుందని ఆలయ కార్యనిర్వాహక అధికారి అక్కిరెడ్డి తెలిపారు.

• సృజన

హ్యాపీ స్పేస్



• భార్గవి

యాంత్రిక ప్రయాణంలో పోటీ ఎప్పుడూ ఉండేదే! కానీ, చంటిబిడ్డ తన జీవనంలోకి వచ్చినప్పుడు అమ్మ కళ్లలో.. కలల్లో చుట్టూ జీవం ఉండాలనుకుంటుంది. 'ఆ ప్రయాస నుంచి పుట్టుకువచ్చిందే నా ప్రకృతి ఎకో ప్లే థీమ్' అంటోంది భార్గవి. హైదరాబాద్ అల్వాల్‌లో ఉంటున్న భార్గవి నేచురల్ కలర్స్ వాడకం గురించి అపార్ట్‌మెంట్ పిల్లలకు పరిచయం చేస్తూ కనిపించారు. ఆసక్తితో ఆమె చేస్తున్న పని గురించి ప్రశ్నించినప్పుడు పిల్లల కోసం తను సృష్టించిన సహజ ప్రపంచాన్ని మన ముందుంచారు..

''పుట్టింది మెదక్ జిల్లాలో. ఎమ్‌టెక్ చేసి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో బిజీ బిజీగా మారిపోయాను. పెళ్లి, పిల్లలు జీవితంలోకి వచ్చాక నాలో ఎన్నో సందేహాలు తలెత్తాయి. మూడేళ్ల నా కూతురు స్వతంత్రంగా ఎదగాలంటే ఏదైనా హ్యాపీ స్పేస్ ఉందా.. అని వెతికాను. కానీ, నాకేవీ సంతృప్తినివ్వలేదు. ప్రకృతికి ఎంత దగ్గరగా ఉంటే పిల్లల వికాసం అంత బాగుంటుంది అనే తపన నాది. దీంతో చాలారోజులు ఆలోచించాను. నా సేవింగ్స్ ఎంత ఉన్నాయో చూసుకున్నాను. చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకున్నాను. ఆరేళ్లక్రితం నా ఇద్దరు పిల్లలతో ఈ థీమ్ ప్రాజెక్టును ప్రారంభించాను. ఇప్పుడు ముప్పైమంది పిల్లలు ఉన్నారు. ఈ ముప్పై సంఖ్య దగ్గరే నేను కటాఫ్ పెట్టుకున్నాను. స్వలాభం ఏ మాత్రం చూసుకోని ఒక ప్రాజెక్ట్ ఇది. నాకై నేను నా పిల్లలకోసం సృష్టించుకున్న ప్రపంచం. ఈ పిల్లలు ఎదిగి, హైస్కూళ్లకు వెళ్లినప్పుడు ఎంత ప్రతిభను చూపిస్తున్నారో స్వయంగా తెలుసుకుంటున్నాను. ఈ హ్యాపీ స్పేస్‌లో పిల్లలు చేసే అద్భుతాలు కళ్లారా చూడాల్సిందే. అందమైన పెయింట్స్ వేస్తుంటారు. సీడ్ బాల్స్ తయారుచేస్తారు. కాగితాలతో బొమ్మలు తయారుచేస్తారు. కూరగాయలు, పువ్వులతో రంగులు తయారుచేస్తారు. తొమ్మిదేళ్ల పాప ఫిక్షన్ స్టోరీస్ రాసి, బుక్ కూడా పబ్లిష్ చేసింది.ఆరుబయట చెట్ల కింద రాలి పడిన పూలు, విత్తనాలను ఏరుకొచ్చి, ఒక్కోదాని గురించి వివరంగా అడిగి తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటారు. వారికి ఇష్టమైన పండ్లు, కూరగాయలతో సలాడ్స్ చేస్తుంటారు. ప్రతీదీ నిశితంగా పరిశీలించడం వల్ల వారిలో ఎంతటి అవగాహన పెరుగుతుందో స్వయంగా చూస్తుంటాం. ఇది వారి మానసిక వికాసానికి ఎంతో మేలు కలిగిస్తుంది.

హ్యాండీ క్రాఫ్ట్ తయారీలో పిల్లల చూపే ప్రతిభ చాలా సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లలను స్వతంత్రంగా ఎదగనిస్తే ఎన్ని అద్భుతాలు చూపుతారో స్వయంగా నేనే తెలుసుకుంటూ ఆశ్చర్యపోతుంటాను. రెండేళ్ల నుంచి పద్నాలుగేళ్ల పిల్లలు ఈ గ్రూప్‌లో ఉన్నారు. పిల్లలు వేసే ప్రశ్నలే ఈ ఎకో థీమ్‌లో పాఠ్యాంశాలు.



• ఎకో ప్రాజెక్ట్ వర్క్‌లో...

• నిశితంగా తెలుసుకుంటూ...

ఎవరికీ నచ్చలేదు...

మా దగ్గరకు వచ్చే పిల్లల్లో ఇప్పుడు స్పెషల్ కిడ్స్ కూడా ఉన్నారు. వారిలో ఎంత ఆర్ట్ ఉందో చూసినప్పుడు చాలా ఆశ్చర్యపోతుంటాను. చాలా మంది పేరెంట్స్ ముందు నా థీమ్‌ను ఏ మాత్రం నమ్మలేదు. 'పిల్లలకు ఈమె ఏమీ నేర్పడం లేదు. ఆడుకోవడానికి వదిలేస్తున్నారు. క్రమశిక్షణగా పిల్లలు ఒక్క దగ్గర కూర్చోవడం లేద'ని చాలా మంది తల్లిదండ్రులు తిరిగి వెళ్లిపోయారు. కోవిడ్ టైమ్‌లో అయితే అందరూ మూసేయమనే సలహాలే. మా ఇంటి నుంచి మరీ ఎక్కువగా వచ్చాయి. 'జాబ్ మానేసి, ఇలాంటి ప్రాజెక్ట్ వద్దు, ఎలాంటి లాభాలూ ఉండవు' అనే మాటలే నా చుట్టూ విన్నాను. కానీ, లాభం కోసం ఈ థీమ్‌ని ఎంచుకోలేదు. నా పిల్లల కోసం ఎంచుకున్నాను. నేను నమ్మిన ఈ సిస్టమ్‌పై నాకు చాలా నమ్మకం ఉంది. నా ఈ థీమ్‌కు తగిన టీచర్లను ఎంపిక చేసుకోవడం కూడా కష్టంగా ఉండేది. దీంతో నేనే కొందరిని ఎంపిక చేసుకొని, నాకు తగినవిధంగా ట్రెయిన్ చేసుకున్నాను. అదే పట్టుదలతో కొనసాగించాను. ఫైనాన్షియల్‌గా ఇది సక్సెస్‌ఫుల్ అని చెప్పలేం. కానీ, ఎప్పటికీ నిలిచే ఉండేది, నాకు సంతృప్తిగా అనిపించిన ప్రపంచం ఇదే. దానినే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నాను. నా పిల్లలనూ ఈ ప్రపంచంలో పెంచడం చాలా హ్యాపీగా ఉంది.

అవగాహన కార్యక్రమాలు...

ఈ థీమ్ వల్ల పిల్లల్లో జరిగే మానసిక వికాసం ఎంతగా ఉంటుందో తెలియజేస్తూ కార్పోరేట్ స్కూళ్లలో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తున్నాం. పిల్లల్లోని స్వయంప్రతిభ ఎలా ఉంటుందో, వారిని వారిలాగే ఎలా ఎదగనివ్వాలో మా నేచర్ పిల్లలను పరిచయం చేసి, మరీ చూపుతుంటాను. రోజువారీ మనకు ఏం అవసరమో వాటన్నింటినీ స్వయంగా ఇక్కడి పిల్లలు చేస్తుంటారు. వాళ్లే వంట చేయడం, తినడం.. ఏదీ కూడా చెప్పకుండానే ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ, తమ ప్రతిభను చూపుతుంటారు. లాభాపేక్ష లేకుండా చేసే ఈ పని రాబోయే తరాలకు ప్రయోజనం కలిగించడమే నాకు వచ్చే ఆదాయం' అని చెబుతోంది భార్గవి.

– నిర్మలారెడ్డి

ఫొటో: మోహనాచారి

• న్యాయమైన సూచన

తండ్రికీ కావాలి ప్రసూతి సెలవు



తల్లికి ప్రసూతి సెలవు ఇస్తున్నట్టే తండ్రికి కూడా ప్రసూతి సెలవు ఇవ్వడం గురించి ఆలోచించే సమయం వచ్చేసిందని మద్రాసు హైకోర్టు వ్యాఖ్యానించింది. భార్య ప్రసవ సమయంలో బాలింతను, నవజాత శిశువును చూసుకోవడానికి తండ్రికి సెలవు ఇవ్వకతప్పదని, ఈ మేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు శాసనపరమైన చట్టాలు తేవాలని జస్టిస్ విక్టోరియా గౌరి సూచించారు. నిజమే. తండ్రికి సెలవు భార్యభర్తల మధ్య అనేక చికాకులను దూరం చేయగలదు. ఒక పరిశీలన.

బిడ్డకు జన్మనివ్వడమంటే సమాజానికి కొత్త సభ్యుణ్ణి ఇవ్వడమే. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు సంతానం కావచ్చు కాని సమాజానికి ప్రతినిధే. బిడ్డకు సురక్షితంగా జన్మనివ్వడంలో తల్లిదండ్రుల బాధ్యత ఎంతో, ఆ తల్లిదండ్రులకు తగిన సౌకర్యాలు కల్పించడంలో సమాజానిదీ అంతే బాధ్యత. కనేందుకు ఆస్పత్రి, పెంచేందుకు తండ్రికి కనీస ఆదాయం లేకపోతే సమాజం తప్పవుతుంది. గతంలో స్త్రీ ఇంటి పట్టునే ఉండేది. ఉమ్మడి సంసారాల్లో కాన్పులకు సులువుగా సాయం దొరికేది. కాని ఇప్పుడు ఇలా తాళి కడితే అలా విడిగా కాపురం పెట్టే పరిస్థితులు వచ్చాయి. దానివల్ల పిల్లల్ని కనడం, పెంచడం చాలా పెద్ద బాధ్యతగా మారింది తల్లిదండ్రులకు. ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ప్రసూతి సెలవులు మంజూరు అవుతున్నా ఆ స్త్రీలకు, పుట్టిన శిశువులకు కాన్పు సమయంలో తోడుగా ఉండాల్సిన పురుషులకు మాత్రం సెలవు గురించి ఇంకా ఆలోచన రావడం లేదు. సమాజం ఇంకా అంత 'నాగరికం'గా ఆలోచించడం లేదు. కాని తాజా ఘటన ఈ అంశాన్ని చర్చకు తెచ్చింది.

సమయం వచ్చేసింది

మద్రాసు హైకోర్టులో ఈ కేసును విన్న జస్టిస్ ఎల్.విక్టోరియా మేరి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో మగవారికి ప్రసూతి సెలవులు తప్పనిసరి చేస్తూ చట్టాలు తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సమస్యకు స్పందించాల్సిన సమయం వచ్చేసిందని అన్నారు. 'పిల్లల్ని కని, పెంచడంలో స్త్రీ, పురుషులిరువురికీ సమాన బాధ్యత ఉంటుంది. ప్రపంచంలోని అనేక దేశాలు ప్రసూతి సమయంలో తల్లితో పాటు తండ్రికీ సెలవులు ఇస్తున్నాయి. అవి ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రమాణాలకు సరితూగకపోయినా ఏదో ఒక మేరకు ఇస్తున్నాయి. మన దేశంలో సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (1972) ప్రకారం భార్య ప్రసూతి సమయంలో పురుషులకు లీవ్ పెట్టే వీలు ఉంది. కాని ఆ రూల్స్ చాలా రాష్ట్రాల్లో అమలు కావడం లేదు'.



-జస్టిస్ విక్టోరియా గౌరి, మద్రాసు హైకోర్టు

కోర్టుకెక్కిన తండ్రి

తమిళనాడులోని తెన్‌కాశీలో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న బి.శరవణన్ తన భార్యకు కాన్పు సమయంలో తోడు ఉండేందుకు 90 రోజుల సెలవు అడిగాడు. దానికి కారణం అతని భార్య ఐ.వి.ఎఫ్. ద్వారా గర్భం దాల్చడమే. ఐ.వి.ఎఫ్.ద్వారా గర్భం దాల్చితే కాన్పు అయ్యేంత వరకూ జాగ్రత్తగా ఉండాలి. అందుకే సెలవు అడిగాడు. పరిస్థితి విన్న అధికారులు శాంక్షన్ చేశారు. కాని ఆ సెలవు ఉపయోగంలోకి రాక ముందే అతను విధుల్లో లేకపోతే లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని సెలవు కేన్సిల్ చేశారు. దాంతో శరవణన్ కోర్టుకు వెళ్లాడు. డెలివరీ డేట్ మే 30 కనుక కోర్టు మే 1 నుంచి సెలవు ఇమ్మంది. అధికారులు 30 రోజులు సెలవు మంజూరు చేశారు. కాని డెలివరీ మే 31న జరిగింది. దాంతో మే 31న శరవణన్ విధులకు హాజరు కాలేకపోయాడు. అంతే కాదు సెలవు పొడగింపును కోరాడు. అధికారులు సెలవును పొడిగించకపోగా చెప్పాపెట్టకుండా విధులకు హాజరుకానందున ఎందుకు చర్య తీసుకోకూడదో జూన్ 22న వచ్చి వ్యక్తిగతంగా సంజాయిషీ ఇమ్మని ఆదేశించారు. ఆ ఆదేశాలను శరవణన్ హైకోర్టులో సవాలు చేశాడు. కోర్టు ఆ ఆదేశాలను కొట్టేస్తూ మగవారికి కూడా ప్రసూతి సెలవులు అవసరమని అభిప్రాయపడింది.

ఆందోళన లేకుండా

కాన్పు సమయంలో భార్యకు ఎంత ఆందోళన ఉంటుందో భర్తకూ అంతే ఆందోళన ఉంటుంది. రెండు ప్రాణాలు పరీక్ష సమయాన్ని ఎదుర్కొనే వేళ సహజంగానే లేబర్ రూమ్ బయట పురుషుడు ఒత్తిడికి లోనవుతాడు. అదొక్కటే కాదు బిడ్డ పుట్టాక భార్యకు శక్తి వచ్చే వరకు, బిడ్డ కుదుట పడేవరకు ఇంట్లో పనులు ఎన్నో ఉంటాయి. ఆస్పత్రుల చుట్టూ తిరుగుళ్లు ఉంటాయి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఇంటి నుంచి ఫోన్ రాగానే కంగారు పడుతూ భర్తలు ఆ సమయంలో వేదన అనుభవిస్తారు. మరోవైపు తోడుండాల్సిన భర్త ఇంటి పట్టున లేకపోతే, డబ్బు సంపాదన ఎంత తప్పనిసరి అయినప్పటికీ, భార్యకు నిస్పృహ రావడం సహజం. రాత్రిళ్లు చంటి పిల్లల ఏడ్పు వల్ల ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లాల్సిన భర్త నిద్ర చెడి చిరాకు పడితే ఆ గొడవ కాస్తా విడాకుల వరకు వెళ్లిన కేసులెన్నో. అందువల్ల భార్యతో పాటు భర్తకు సెలవులు ఇవ్వడం ఎంతో అవసరం. 'కనేది ఆమె అయితే ఇతనికేం నొప్పి' అని హేళన చేసే రోజులు పోయాయి. ఈ బిజీ రోజుల్లో మనిషి తోడు కష్టమైన రోజుల్లో భర్తకు భార్య, భార్యకు భర్త ఒకరికొకరై సంతానాన్ని సాకాలంటే ఇలాంటి నాగరికమైన ఆలోచనలు తప్పక చేయాల్సిందే.

పర్యావరణ పరిరక్షణ గురించి మాటలు కాదు, చేతల్లో చూపించండి అని గ్రేటాథన్ బర్గ్ గళం విప్పింది. ఈ మాటను తూ.చ. తప్పకుండా ఆచరిస్తూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది మాన్యా. అందుకే మాన్యను' అంతర్జాతీయ యూత్ ఇకో– హీరో' అవార్డు వరించింది.

అసామాన్యం



• మాన్య





పర్యావరణ సమస్యలను పరిష్కరించే ఎనిమిది నుంచి పదహారేళ్ళలోపు వయసు వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తారు. ప్రపంచవ్యాప్తంగా పదిహేడు మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపిక చేయగా మన దేశం నుంచి మాన్యహర్షను ఏరికోరి ఈ అవార్డు వరించింది. మాన్య చేపట్టిన 'సన్‌షైన్'ప్రాజెక్టుకు గానూ ఇంతటి గుర్తింపు లభించింది. 27 దేశాలు, 32 అమెరికా రాష్ట్రాల్లో... ఇరవై ఏళ్లుగా పర్యావరణం గురించి కృషిచేస్తోన్న... 339 మందిని గుర్తించి వారిలో పదిహేడు మందికి ఇకో హీరో అవార్డులు ఇచ్చారు.

బెంగళూరుకు చెందిన పదిహేడేళ్ళ మాన్య గోల్డెన్ బీ ఆఫ్ విబ్జిఆర్ హైస్కూల్లో చదువుతోంది. చిన్నప్పటి నుంచి మొక్కలంటే ఇష్టం. మాన్యకు నాలుగేళ్ల ఉన్నప్పుడు నానమ్మ రుద్రమ్మ మాన్యతో మొక్కను నాటిస్తూ... ''ప్రకృతినీ, పర్యావరణాన్నీ ప్రేమగా చూసుకోవాలి. మనతోపాటు మొక్కలు, జంతువులను బతకనిస్తే మనం బావుంటాము'' అని ఆమె మాన్యకు చెప్పింది. అప్పటి నుంచి మాన్యకు పర్యావరణంపై మక్కువ ఏర్పడింది. చిన్నప్పటి నుంచి పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనేది.

లాక్‌డౌన్ సమయంలో...

కరోనా వైరస్ చెడు చేసినప్పటికీ సరికొత్త పనులు చేయడానికి కొంత మందికి వెసులుబాటు కల్పించింది. ఈ వెసులుబాటును వాడుకున్న మాన్య.. పిల్లల కోసం 'సన్ షైన్' అనే మ్యాగజైన్‌ను ప్రారంభించింది. ప్రింట్, డిజిటల్ కాపీల ద్వారా పర్యావరణ పరిరక్షణ గురించి పిల్లలకు అవగాహన కల్పిస్తోంది. ఈ మ్యాగజైన్‌ను బెంగళూరులోని మాంటిస్సోరి, ఇతర స్కూళ్లలోని పిల్లలకు ఉచితంగా అందిస్తోంది. వివిధ కార్యక్రమాలను పరిచయం చేస్తూ పర్యావరణ ప్రాధాన్యత గురించి వివరిస్తోంది. 'ఈచ్ వన్ ప్లాంట్ వన్ క్యాంపెయిన్', 'పేపర్ మేకింగ్ వర్క్‌షాప్', 'పిల్లలు నీటిని ఎలా కాపాడగలరు?','న్యూ ఇండియా సస్టెయినబుల్ క్యాంపెయిన్','ప్లాస్టిక్ ఫ్రీ జూలై రైటింగ్ కాంపిటీషన్', ఎర్త్‌డే రోజు పెయింటింగ్ పోటీల వంటివాటిని మ్యాగజైన్ ద్వారా నిర్వహిస్తూ పర్యావరణంపై చక్కని అవగాహన కల్పిస్తోంది. తన యూట్యూబ్ ఛానెల్లో కూడా పర్యావరణ కార్యక్రమ వీడియోలు షేర్ చేస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

పీల్స్‌తో పేపర్స్..

అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు వంటింట్లో మిగిలిపోయే కూరగాయ తడి వ్యర్థాలను ప్యాకింగ్ పేపర్స్‌గా మారుస్తోంది. కూరగాయ తొక్కలను ఉపయోగించి, పెన్సిల్స్, పేపర్‌లు రూపొందిస్తోంది. ఇప్పటి దాకా రెండు వందలకు పైగా వెజిటేబుల్ పీల్ పేపర్లను తయారు చేసింది. ఇందుకోసం వంటింట్లో మిగిలిపోయిన వ్యర్థాలు, పండుగల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సేకరించి, వాటిని గ్రైండ్ చేసి పేపర్‌గా మార్చడం విశేషం. పాత జీన్స్ ప్యాంట్లను డెనిమ్ పేపర్‌లుగా తీర్చిదిద్దుతోంది. మాన్యా స్వయంగా తయారు చేయడమే గాక, వర్క్‌షాపుల ద్వారా పేపర్‌ల తయారీ గురించి పిల్లలకు నేర్పిస్తోంది.

అనేక అవార్డులు..

నాలుగున్నరవేలకు పైగా మొక్కలను నాటి, ఏడువేల మొక్కలు పంపిణీ చేసింది. ఐదువేల విత్తనాలను నాటింది. ఎనిమిదివేలకు పైగా ఆర్గానిక్, కాటన్ సంచులను పంచింది. సిటీ, హైవే రోడ్లు, నీటి కుంటలను శుద్ధిచేసే కార్యక్రమాలను చేపట్టింది. వీటన్నింటికి గుర్తింపుగా మాన్యకు అనేక అవార్డులు వచ్చాయి. వెజిటేబుల్ పేపర్‌కు గ్రీన్ ఇన్నోవేటర్, జల వనరుల మంత్రిత్వ శాఖ 2020 సంవత్సరానికి గాను 'వాటర్ హీరో', ఎర్త్‌డాట్ ఓ ఆర్జీ ఇండియా నెట్‌వర్క్ నుంచి రైజింగ్ స్టార్, హ్యూమానిటేరియన్ ఎక్స్‌లెన్స్ అవార్డులు వచ్చాయి. పృథ్వీ మేళా, అక్షయ్‌కల్ప రీసైక్లింగ్ మేళా, లయన్స్ క్లబ్, బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్, బైజూస్ పేపర్ బ్యాగ్ డే వంటి కార్యక్రమాల్లో పర్యావరణంపై ప్రసంగించింది. ఇవన్నీగాక మాన్య ప్రకృతిమీద ఏడు పుస్తకాలు రాసింది. 2019 ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ యంగెస్ట్ పోయెట్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రాండ్ మాస్టర్ టైటిల్ గెలుచుకుంది.

''ఈ అవార్డు నా కృషిని గుర్తించి మరింత స్ఫూర్తిని ఇచ్చింది. భవిష్యత్‌లో నా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకువెళ్తాను'' అని చెబుతూ ఎంతోమందిని ఆలోచించేలా చేస్తోంది మాన్య.

ఏ క్యారెక్టర్‌తోనైనా... చాట్ చేయొచ్చు



సాపేక్ష సిద్ధాంతం గురించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌తో సంభాషించింది సృజన. సినిమాలు ఎక్కువగా చూసే గీతిక దర్శక దిగ్గజం ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో 'నంబర్ 13' నుంచి 'ది వైట్ షాడో' వరకు ఎన్నో సినిమాల గురించి వివరంగా సంభాషించింది. ఇక స్వరతేజకు జపనీస్ ప్రఖ్యాత వీడియో గేమ్ క్యారెక్టర్ 'మారియో'తో సంభాషించడం సరదా! కాల్పనికత అనేది మనకు బొత్తిగా కొత్త కాదు. అయితే ఏఐ సాంకేతికత కాల్పనికతను మరోస్థాయికి తీసుకువెళ్లింది. యువతరం తాజా ఆర్టిఫిషియల్ క్రేజ్ 'క్యారెక్టర్.ఏఐ' ఆ సాంకేతికతలో భాగమే...

యూత్ పల్స్

ఏఐ పవర్ హౌజ్ 'ఓపెన్ ఏఐ' అంతర్జాల సంచలనంగా మారింది. 'చాట్ జీపీటీ' పాపులారిటీతో ఎన్నో టెక్నాలజీ కంపెనీలు తమ సొంత ఏఐ చాట్ బాట్‌లను ప్రవేశపెట్టాయి. 'చాట్‌జీపీటీ' పాపులారిటీ సంగతి ఎలా ఉన్నా యువతరం తాజా ఆసక్తులలో 'క్యారెక్టర్. ఏఐ' ఒకటిగా మారింది.

'క్యారెక్టర్. ఏఐ' ద్వారా సెలబ్రిటీలు, చారిత్రక వ్యక్తులు, కాల్పనిక పాత్రలు, పాపులర్ వీడియో గేమ్ క్యారెక్టర్‌లు, థెరపిస్ట్‌లతో హాయిగా సంభాషించవచ్చు. సంభాషణల విషయంలో ఇది 'చాట్ జీపీటి' కంటే సహజంగా ఉంటుందనే టాక్ వినిపిస్తోంది.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, మెషిన్ లెర్నింగ్ కాంబినేషన్‌లో 'క్యారెక్టర్. ఏఐ'ను అభివృద్ధి చేశారు. 'క్యారెక్టర్.ఏఐ'లో ఎకౌంట్ సెటప్ పూర్తి చేసిన తరువాత 'క్రియేట్ ఏ క్యారెక్టర్' ఆప్షన్‌ను క్లిక్‌చేస్తే విండో ఓపెన్ అవుతుంది. క్యారెక్టర్ తనకు తాను పరిచయం చేసుకుంటుంది. ఆ తరువాత సంభాషణ మొదలుపెట్టవచ్చు.

ఉదాహరణకు...'హారీ పోటర్' సిరీస్ లోని ఫిక్షనల్ క్యారెక్టర్ హమైనీ గ్రేంజర్‌తో సంభాషించాలనుకున్నాం.

'హలో రమ్య, మై నేమ్ ఈజ్ హమైనీ గ్రేంజర్. ఇట్స్ వెరీ నైస్ టు మీట్ యూ' అంటూ తనను తాను పరిచయం చేసుకుంటుంది హమైనీ. తన ఇష్టాయిష్టాలు, ఆసక్తుల గురించి చెబుతుంది.

రిలవెంట్ ట్యాగ్స్ అందుబాటులో ఉంటాయి. క్యారెక్టర్ వ్యక్తిత్వం ఆధారంగా డ్రాప్ డౌన్ మెన్యూ నుంచి స్పీకింగ్ వాయిస్‌ను సెలెక్ట్ చేసుకోవచ్చు.

ఒక క్యారెక్టర్‌తో చాట్ చేయవచ్చు లేదా మల్టిపుల్ క్యారెక్టర్స్‌తో గ్రూప్ చాట్ చేయవచ్చు.

'క్యారెక్టర్. ఏఐ' అనేది టెక్స్ట్‌కు మాత్రమే పరిమితం కాదు. ప్రాంప్ట్స్, చాట్స్ ఆధారంగా ఇమేజ్‌లను క్రియేట్ చేయవచ్చు.

ఏఐ ఇండస్ట్రీ ప్రముఖులుగా గుర్తింపు పొందిన షాజీర్, డేనియల్ ఫ్రెటస్ గూగుల్‌లో పనిచేస్తున్నప్పుడు 'క్యారెక్టర్. ఏఐ'కు సంబంధించి ఆలోచన చేశారు. షాజీర్ 'అటెన్షన్ ఈజ్ ఆల్ యూ నీడ్' పుస్తక రచయితలలో ఒకరు. ఇక డేనియల్ 'మీన' అనే చాట్‌బాట్ క్రియేటర్.

వ్యక్తిగత వస్తువులు ఉన్నట్లే, పర్సనలైజ్‌డ్ చాట్ బాట్‌లు ఉండాలనుకునేవారికి క్యారెక్టర్ ఏఐ ఉపయోగపడుతుంది. 'వర్చువల్ ఫ్రెండ్'ను సృష్టిస్తుంది.

'పర్సనలైజ్‌డ్ చాట్‌బాట్ అంటే మాటలా? ఖర్చు బాగానే అవుతుంది కదా' అనే సందేహం వస్తుంది. అయితే 'క్యారెక్టర్. ఏఐ'తో ఖర్చు లేకుండానే సొంత చాట్‌బాట్‌ను సృష్టించుకోవచ్చు.

ఆ.. ఏముంది... అంతా కాల్పనికమే కదా అనుకుంటే ఏమీ లేకపోవచ్చు. ఉంది అనుకుంటే మాత్రం ఎంతో ఉంది.

'కొత్త అనుభూతిని సొంతం చేసుకున్నామా లేదా అనేది ముఖ్యం కాని వాస్తవమా కాదా అనేది ముఖ్యం కాదు' అంటున్నాడు 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా' కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం అసోసియేట్ ప్రొఫెసర్ మైక్.

'చాట్ జీపీటీ' గురించి ఎంత గొప్పగా చర్చించుకున్నప్పటికీ కొన్ని ప్రయోగాలు దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ... నేషనల్ ఈటింగ్ డిజార్డర్స్ అసోసియేషన్ బరువు తగ్గడానికి సంబంధించి సమస్యాత్మక సలహా ఇచ్చినందుకు తమ చాట్‌బాట్‌ను సస్పెండ్ చేసింది. క్యారెక్టర్.ఏఐ విషయంలోనూ పొరపాట్లు జరగవచ్చు. సాంకేతికతకు పరిమితులు ఉండే విషయాన్ని అర్థం చేసుకోవాలి' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ మనీష.

రియల్ చాలెంజర్... జెమిని



ఏఐ రేసులో ఓపెన్ ఏఐ లాంగ్వేజ్ మోడల్స్ లీడింగ్‌లో ఉన్నప్పటికీ ఇది ఎప్పటివరకు అనేది ప్రశ్నార్థకంగా ఉంది. దీనికి కారణం సరికొత్తగా వస్తున్న పవర్‌ఫుల్ ఏఐ మోడల్స్. వీటిమాట ఎలా ఉన్నా గూగుల్ వారి 'జెమిని'ని అసలు సిసలు రియల్ చాలెంజర్ అంటున్నారు. గూగుల్ తమ కొత్త 'జెమిని' ప్రాజెక్ట్‌లో భాగంగా నెక్స్ట్- జనరేషన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్‌ను లాంచ్ చేయనుంది.

'జెమిని' అనేది కన్వర్‌సేషనల్ టెక్స్ట్‌ను జనరేట్ చేయడానికి పరిమితం కాదు. ఇన్‌పుట్స్, వీడియోలు, ఇమేజ్ లను హ్యాండిల్ చేసే మల్టీ–మోడల్ జెమిని. గూగుల్ దగ్గర ఉన్న అపారమైన వనరులు(యాక్సెస్ టు యూ ట్యూబ్ వీడియోస్, గూగుల్ బుక్స్, సెర్చ్ ఇండెక్స్, స్కాలర్ మెటీరియల్)లతో 'జెమిని' ఇతర కంపెనీలకు గట్టి ప్రత్యర్థిగా మారనుంది. 'ఎక్స్‌క్లూజివ్ టు గూగుల్' అనే ప్రత్యేకత వల్ల జెమిని మరింత బలంగా మారనుంది.

